
కథా నిలయం

# మనసులో...

**- కారంపూడి వెంకట రామదాస్**



వెలుగు రేఖలు విచ్చుకోక ముందే విధి నిర్వాహణలోకి దిగిన బిందు, ఓ చేతిలో మాసిన ప్లాస్టిక్ గోనె సంచీ, మరో చేతిలో అయస్కాంతానికి కట్టబడిన పొడగాటి తాడుని పట్టుకుని దానితో రోడ్డుమీదున్న యినప ముక్కల్ని ఏరుకుంటూ ముందుకు కదుల్తోంది. పట్టుమని పదేళ్ళు నిండా లేని ఆ చిన్నారి జీవనోపాధి అదే! ముఖ్యంగా ఆమె తిరిగేది చిన్న చిన్న యింజినీరింగ్ పనులు చేసే షాపులున్న ఏరియాలోనే. ఎందుకంటే ఆమె పని సులువైయ్యేది అక్కడే. ఆ షాపులవాళ్ళు పారేసే నిరుపయోగమైన చిన్న చిన్న యినప ముక్కల్ని స్సులభంగా ఏరుకుంటుంది. వాటిమీద రోజుకి యాభై నుండి డెబ్భైదాకా యిట్టే సంపాదిస్తోంది. చుట్టుపక్కల యిళ్ళవాళ్ళు జాలితో ఏదో ఒకటి తినడానికి అప్పుడప్పుడూ పెడుతుంటారు. దానితో కాలక్షేపం బాగానే జరిగిపోతోంది. భవిష్యత్తంటే అర్థంకూడా తెలీని వయసు కావడంతో చీకూ చింతా లేకుండా రోజులు గడిపేస్తోంది. ఆమె లాంటి అనాధ పిల్లల జీవనశైలి యించుమించు అదే!

"ఏయ్.. పిల్లా! యిటురా.." అంటూ బిందుని పిలిచింది కామాక్షి.

కామాక్షి పిలుపు బిందుకి సంతోషాన్నిచ్చింది. ఎవరైనా పనిగట్టుకు పిలిచారంటే పట్టెడన్నమో లేదా ఫలహారమో పెట్టడానికేనని ఆమెకి తెలుసు. అందుకే ఆ సంతోషం.

"అమ్మ! సెప్పండ్రి" అంది ఆశతో.

"యిట్టా కూర్చోని ఈ టిఫిన్ తిను" అంటూ ఓ నాలుగు అట్లు ఓ పేపర్ ప్లేటులో పెట్టి యిచ్చింది కామాక్షి.

ఎందుకో ఆ పిల్లని చూస్తే కామాక్షికి జాలేసింది. చక్కగా చదువుకోవలసిన వయసులో చేత జోలె పట్టి జీవనోపాధికి ఏదేదోచేస్తూ పొట్టపోసుకొంటున్న ఆ పిల్లని చూస్తే ఆమె మనసు కలుక్కుమంది. ఆమాటకొస్తే ఆ మాత్రం హృదయమున్న ఎవరికైనా ఈ తలంపు తప్పదు.

చింపిరి జుట్టూ, చిరిగిపోయిన గౌనులో వున్న బిందువుని చూసి కామాక్షి ఎందుకో తట్టుకోలేకపోయింది.

టిఫిన్ ఆవురావురుగా తిన్న బిందు, కళ్ళతోనే కామాక్షికి కృతజ్ఞతలు చెప్పుకుంది.

"ఆఁ...నీపేరేంటి?" అడిగింది కామాక్షి మాటలు కలుపుతూ.

"బిందు" తల గోక్కొంటూ అంది తన పేరెందుకడిగిందో తెలియక తికమకతో.

"ఆఁ... ఏమైనా చదువుతున్నావా...?"

"సదువా...?" నవ్వింది బిందు.

"నాకీ పనితోనే దినవంతా సరిపోద్ది. అయినా నన్నెవరు సదివిస్తరు...?"

"యింతకీ నీకెవరైనా వున్నారా...?" అనుమానంగా అడిగింది కామాక్షి.

ఈ ప్రశ్నకి బిందు ఓ క్షణం ఆలోచించింది. పైన ఆకాశాన్నీ, కింద నేలకేసి ఒక్కసారి చూసీ, వాటినే తన వాళ్ళుగా చూపుడు వేలితో చూపించింది. ఎందుకో ఆమాట నోటితో చెప్పడానికి ఆమె గొంతు పెగల్లేదు.

మౌనంగానే తనకెవ్వరూ లేరని ఆ పిల్ల చెప్పిన తీరుకి కామాక్షి ఆశ్చర్యపోయింది.

"ఒక్కసారి వుండు.."అంటూ లోపలికి వెళ్ళింది కామాక్షి.

'ఎందుకుండమందా?' అని ఆలోచనలో పడింది బిందు.

బయటకొచ్చిన కామాక్షి చేతిలో నాలుగైదు గౌన్లున్నాయి. వాటిని బిందుకిస్తూ-

"యివి తీసుకో. మా చెల్లెలి కూతురివి.. ఎవరైనా పేదింటి పిల్లకిమ్మని యిచ్చింది. నీకు సరిగ్గా సరిపోతాయి" అంది కామాక్షి.

బిందు మొహం ఆనందంతో వెలిగిపోయింది.

"మంచిగున్నాయమ్మా...!" అంటూ సంతోషంగా పుచ్చుకుంది.

"తిండి బెట్టి, బట్టలిస్తివి.. ఏదైనా పని చేసెడిదుంటే చెప్పరాదు జేస్తను.."అంది బిందు.

బిందు ఆత్మాభిమానానికి ఆశ్చర్యపోయింది కామాక్షి.

"సర్లేవే.. నీ చేత ఏదో పని చెయ్యించేందుకు యివన్నీ యివ్వలేదు. ఏదైనా పని పడితే చెప్తాలే...!" నవ్వుతూ అంది కామాక్షి.

"ఆఁ... యింతకీ నీ యిల్లెక్కడ?" అడిగింది కామాక్షి.

"ఈ గల్లీలన్నీనాయేఁ... దొరికిన సోటు తిండం, నిద్రొచ్చిన కాడ పండుకోడం...!"అంటూ ఆనందంగా నవ్వుకుంటూ ముందుకు సాగిపోయింది బిందు.

"ఏమిటీ పిల్లా...? చికూ చింతా లేకుండా ఎంత నిశ్చింతగుందీ? 'ఉఁ...' తెలిసీ తెలియని వయసు...! ఈ మహానగరంలో ఈమెలా ఎందరో?" అనుకుని నిట్టూర్చింది కామాక్షి..

❖ ❖ ❖

"కామాక్షీ...! మన మురళీకి ఆస్ట్రేలియాలో చదువుకై బ్యాంక్ లోన్ ఎప్లై చేసాంగా... అది సేంక్షన్ అయ్యింది" సంబరంగా చెప్పాడు మోహన్.

"అలాగా... చాలా మంచి వార్త చెప్పారండి...! పాస్ పోర్ట్ కూడా వచ్చేసింది. యిహ మనవాడు ఏ ఆటంకం లేకుండా విదేశాలకెళ్ళి చదువుకోచ్చు. వచ్చే శుక్రవారం మంచిరోజు. అంటే యింకో ఐదు రోజులు మాత్రమే వుంది. ఆరోజుకు టిక్కెట్టు తీసుకుంటే మంచిది. ఏమంటారు?"

"అవును కామాక్షి... ఆల్ రెడీ అక్కడ క్లాసెస్ స్టార్టైయ్యాయి. ఇదిగో లోన్ గురించేగా లేటైంది!

**ఉగాది పోటీలో ఎంపికైన కథ**

యిప్పుడా అడ్డంకి తొలగిపోయింది. మురళి యిక ఎంత తొందరగా వెళితే అంత మంచిది" అన్నాడు మోహన్.

కామాక్షి మొహంలో ఒక్కసారిగా దిగులు ఆవరించింది. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది. ఆమెలో సెడన్గా కలిగిన ఈ మార్పుకి కారణం మోహన్ ఊహించకపోలేదు.

"అర్థమైంది కామాక్షీ...! నీలో ఈ దిగులు నీ ముద్దుల కొడుకు నీకు దూరంగా వెళ్ళిపోతున్నాడనే కదా...?"

"నన్నంటున్నారు. ఆ బాధ మీకు లేదా? వాడు మీకు మాత్రం ముద్దుల కొడుకు కాదా? కాకపోతే మీ మగాళ్ళు బయటపడరు."

"నిజమే చెప్పావ్...! నాకూ మనసులో ఏదో మూల ఆ బాధ లేకపోలేదు. జీవితంలో పైకి రావాలంటే, ఈరోజుల్లో యిలాంటివి తప్పవు" అన్నాడు మోహన్.

"యిక షాపింగ్ అదీ చేసి వాడిక్కావలసినవి కొనేస్తే సరిపోతుందండి."

"సరే...! మురళికేం కావాలో వాడ్నే తీసుకెళ్ళి కొనిపెట్టు, నేను ఆ టిక్కట్ల పని చూస్తా" అన్నాడు మోహన్. అప్పుడే యింటికొచ్చిన మురళిని చూసి కామాక్షి.

"ఒరే... రా... రా...! యిప్పుడే మీ నాన్న శుభవార్త తీసుకొచ్చార్రా...! అదే, బ్యాంకు లోన్ సేంక్షన్ అయ్యిందట! వచ్చే శుక్రవారమే నీ ప్రయాణం" సంబరంగా అంది కొడకుతో.

"రాబోయే శుక్రవారమా నా ప్రయాణం?" ఆశ్చర్యంగా అన్నాడు మురళి. ఆ వెంటనే అతడి మొహంలో ఏదో ముభావత చోటుచేసుకుంది.

యిది గమనించకపోలేదు మురళి తల్లిదండ్రులు. ఆ వెంటనే-

"ఏంట్రా నీ ఫ్రెండ్స్‌నొదిలి వెళ్ళాలనా ఆ దిగులు?" అన్నాడు మోహన్.

"మీరుండండీ... వాడికి మనల్నొదిలీ వెళ్ళాలని ఒక వైపు బెంగగా వుంటే ఏంటా మాటలు?" వెంటనే కొడుకుని వెనకేసుకొచ్చింది కామాక్షి.

"సరే... సరే... మీరు షాపింగ్ పన్లను చూడండి. నే ట్రావెల్ ఏజెంట్ దగ్గరకెళ్ళొస్తా"అంటూ మోహన్ బయటకెళ్ళాడు.

మోహన్‌కి చాలా సంతోషంగా వుంది. తను కోరుకున్నట్టు కొడుకుని మెడిసిన్ చదివిస్తున్నాడు. అదీ ఆస్ట్రేలియాలో! యిక కొడుకు భవిష్యత్తు గురించి చింత అనవసరం. కొడుకుని విదేశాల్లో చదివిస్తున్నాడని నలుగురూ అంటుంటే ఎంత గొప్ప? ఆ ఆనందమే వేరు! తనకి తెలిసిన ట్రావెల్స్ కంపెనీకి వెళ్ళి టిక్కెట్లు బుక్‌చేసి ఆ పని ముగించుకుని తిరుగు ముఖం పట్టాడు మోహన్.

* * *

ఆరోజు గురువారం!

ఉదయాన్నే కామాక్షి వాళ్ళింట్లో పెద్ద దుమారమే రేగింది!

తెల్లవారితే ప్రయాణం పెట్టుకుని ఉదయాన్నే పాస్‌పోర్ట్ కనబడ్డం లేదంటూ మురళి బాంబు పేల్చాడు.

"ఏంరా! ఎక్కడ పోగొట్టుకున్నావు...? అయినా ముఖ్యమైన పాస్‌పోర్ట్ విషయంలో అంత అజాగ్రత్తేంట్రా...?"అంటూ కంగారు పడుతూ యిల్లంతా వెతకడం మొదలుపెట్టాడు మోహన్.

"మీరుండండీ...! కంగారు పడకుండా వెతికితే అదే దొరుకుతుందీ..."అని భర్తతో అందే గానీ ఆమెకీ మనసులో ఒకటే కంగారుగా వుంది.

"ఒరే మురళీ... నీ గదిలో బాగా వెతుకు... ఉండు! నేను కూడా వచ్చి వెతుకుతా"అంటూ కామాక్షి, కొడుకు గదిలో అడుగుపెట్టింది.

కప్‌బోర్డ్, టెబిల్లూ, డ్రాయర్లు,.. అల్మారాలు, ఒక టేంటి మొత్తం యిల్లంతా వెతికినా లాభం లేకపోయింది. వెతికినవే పదిసార్లు వెతికారు గానీ ఫలితం శూన్యం.



**మో**హన్‌కి చాలా సంతోషంగా వుంది. తను కోరుకున్నట్టు కొడుకుని మెడిసిన్ చదివిస్తున్నాడు. అదీ ఆస్ట్రేలియాలో! యిక కొడుకు భవిష్యత్తు గురించి చింత అనవసరం. కొడుకుని విదేశాల్లో చదివిస్తున్నాడని నలుగురూ అంటుంటే ఎంత గొప్ప?

అతి కష్టంమీద కోపాన్ని అణచుకున్నాడు మోహన్. కామాక్షికైతే దుఃఖం ఆగలేదు. వారికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. వెతికిన చోటల్లా వస్తువుల్తో చిందరవందరగా వుంది. వాటిని సర్దే ఓపికా, ఆశక్తి వారిలో లేకా ఎక్కడివక్కడే పడేసి దిగాలుగా కూలబడ్డారు.

మురళికి తల్లిదండ్రుల వైపు సూటిగా చూసే ధైర్యం చాలడంలేదు.

"ఏవండీ...! యిప్పుడేం చేద్దామండీ?" నిరాశతో అంది కామాక్షి.

"ఊఁ... ఏముంది పోలీస్ కంప్లైంట్...! డూప్లికేట్ కోసం అప్లై చెయ్యాలి! నానా తంటాలు...! అది రావడానికి ఎన్ని రోజుల్లో... ఎన్ని పాట్లో? రేపటి ప్రయాణం రద్దు... వేలకొలదీ పోసి కొన్న టిక్కెట్లు బుగ్గిపాలు...!" ఈ మాటలంటుంటే మోహన్‌కి దుఃఖం ఆగలేదు.

యింతలో తలుపు చప్పుడైంది.

విసుగ్గానే లేచి వెళ్ళి తలుపు తీసింది కామాక్షి.

ఎదురుగా బిందు!

కామాక్షి వున్న పరిస్థితిలో మరొకరైతే బిందుని తిట్టి తరిమేసేవారే. కాని ఆమె కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ 'ఏమిటన్నట్టు?' ఆ పిల్ల వైపు మొహం చిట్లించి చూసింది.

"అమ్మా...! ఈ పుస్తకం మీదే గావల్న జరా చూసుండ్రి!" అంటూ బిందు చిన్న సైజ్ నీలం కలర్ పుస్తకాన్ని కామాక్షి చేతిలో పెట్టింది.

అది మురళి 'పాస్ పోర్ట్!'

కామాక్షి ఆనందానికి అవధుల్లేవు. ఒక్క క్షణం ముందు సర్వం కోల్పోయిన భావంలో వున్న ఆమెకి ఒక్కసారిగా సమస్తం లభించిన తృప్తి! కంటివెంట కన్నీటి బొట్లు ఆమెకి తెలీకుండానే రాలాయి. కాకపోతే అవి యింతకు ముందులా దుఃఖంలో వచ్చినవి కావు... ఆనంద భాష్పాలు...! అవును మరి బిందు అందించింది సామాన్యమైందా?

"ఏవండీ...! మురళి పాస్‌పోర్ట్ దొరికిందండీ...!" సంతోషంతో కేకలాంటిదే వేసింది కామాక్షి.

"ఏంటీ పాస్‌పోర్టు దొరికిందా...?" ఆనందంతో ఉరుకున కామాక్షి వద్దకొచ్చాడు మోహన్.

"యిదిగో మురళి పాస్‌పోర్ట్...! ఈ పిల్లకి దొరికింది..." సంబరంగా చెప్తూ బిందు రెండు చేతులూ పట్టుకుని లోనికి తీసుకొచ్చింది కామాక్షి.

"ఈ పిల్లకా దొరికింది...? ఏమైనా నిజంగా మనం అదృష్టవంతులం" అన్నాడు మోహన్, బిందువైపు ఆప్యాయంగా చూస్తూ.

"అవునండీ...! ఈ పిల్ల మన వీధిలో పనికిరాని వస్తువుల్ని ఉదయాన్నే లేచి ఏరుకుంటూ జీవనం సాగిస్తుంటుందీ... పాస్‌పోర్టుని మనవాడు రోడ్డుమీద పారేసుకున్నట్టున్నాడు... ఈ పిల్లకి దొరికింది. యిక మనం యిల్లంతా ఎంత గాలించి ఏం లాభం?" అసలు విషయం అర్థమైనట్టు అంది కామాక్షి.

"ఒరే మురళీ...! నీ పాస్‌పోర్టు దొరికిందిరా...! బయటకి రా..." అంది తన గదిలో వున్న కొడుకుని కేకవేస్తూ.

"బిందు...నీకు దొరికిన ఈ పుస్తకం విలువేంటో నీకు తెలుసా...? ఓ జీవితం...!" కామాక్షి నోట ఉద్వేగంగా వెలువడ్డాయా మాటలు.

బిందు తన మాటల్ని అర్థంచేసుకోగలదా? అని ఆలోచించే స్థితిలో లేదు కామాక్షి.

"అవును బిందు... నువ్వీ రోజు మాకు చాలా మేలు చేసావు. వుండు...!"అంటూ మోహన్ లోనికెళ్ళి వెయ్యి నోటు తీసుకొనొచ్చి బిందుకిచ్చాడు.

"సారూ... నాకొద్దు... ఆఁ... ఏందది...? పాస్‌పోర్టో... యేదో... నాకు తెల్వదు గానీ అది నాకు దొరకలేదు సార్...!" అంటూ కాసేపాగింది బిందు.

"ఏంటి... నీకు దొరకలేదా...? మరి యిది నీ దగ్గరకెలా వచ్చింది?" ఆశ్చర్యంగా అడిగారు మోహన్, కామాక్షీలు ఒకేసారి.

"అదీ... అదీ..."

* * *

వాతావర్ణం చాలా చల్లగా వుంది. సమయం అర్ధరాత్రి పన్నెండు!

బిందు మోకాళ్ళని డొక్కలో పెట్టుకుని ముడుచుకుని పడుకొని నిద్రపోవడానికి శత విధాల ప్రయత్నిస్తోంది. అయినా నిద్రపట్టడంలేదు. పైన పేరుకి పైకప్పున్నా చుట్టూ ఓపెన్... పడుకున్నది. ఓ షాపు నీడలో...! అదీ కటిక నేలపైన...! మధ్యమధ్యలో రివ్వున రివ్వున దూసుకుపోతున్న వాహనాలు ఆమె నిద్రని భంగపరుస్తున్నాయి. అందుకే ఆమెకి నిద్రకరువైంది.

యింతలో మోటర్ సైకిల్ పైన ఓ యువకుడు వచ్చి బిందు పడుకున్న దగ్గర్లో ఆగాడు. మోటర్ సైకిల్ దిగి యిటుయిటు చూసాడు. ఎవ్వరూ లేరు! రోడ్డంతా నిర్మానుష్యం...! స్టేండు వేసాడు.

మోటర్ సైకిల్ సౌండ్ దగ్గరగా వచ్చి ఒక్కసారిగా ఆగిపోడంతో ఏంటి చెప్మా...? అని ముసుగులోంచే తొంగి చూసింది. ఎదురుగా లీలగా ఓ యువకుడు.. కళ్ళు చిట్లించుకుని ఆ చీకట్లో అతడు చేసే పనిని ఆశ్చర్యంగా తిలకించింది.

**(మిగతా 21వ పేజీలో)**

(9వ పేజీ తరువాయి)

మోటర్ సైకిల్ నుండి కిందకి దిగిన ఆ యువకుడు మరోసారి యిటు అటు చూసి తననెవరూ గమనిం చడం లేదని నిర్ధారించుకుని జేబులో నుండి ఓ వస్తు వుని తీసి అక్కడున్న మున్సిపాల్టీ చెత్తకుండీలో పడేసి తిరిగి బైక్ ఎక్కి వెళ్ళిపోయాడు.

బిందు ఆ యువకుడ్ని గుర్తుపట్టడానికి ఆ చీకట్లోనే ప్రయత్నించింది. ఆ యువకుడు అదే వీధిలో వున్న ఓ యింట్లో వెళ్ళిపోవడం కూడా గమనించింది.

బిందు వెంటనే లేచి ఆ చెత్తకుండీలో పడేసిన ఆ వస్తువు ఏంటా? అని తీసి చూసింది. అది నీలం రంగులో కొద్ది పేజీలున్న చిన్న పుస్తకం. లోపలున్న ఫొటోని చూసి ఆశ్చర్యపోయింది. పారేసి వెళ్ళిపోయిన యువకుడి పోలికలతో వున్నదా ఫొటో. ఒక్క విషయం అర్థమైంది బిందుకి. ఆ పుస్తకం ఆ వ్యక్తికి సంబంధిం చిందేనని!

బిందు ఆ యువకుడు దూరిన యింటికేసి నడిచింది. ఆ యిల్లు చేరుకున్న ఆమె మరింత ఆశ్చర్యపోయింది. ఆ యిల్లు ఆరోజు తనకి తిండి పెట్టి బట్టలిచ్చిన దేవత దని గుర్తుపట్టింది. అయితే అప్పటికే యింట్లో లైట్స్ ఆపేసి అంతా నిశ్శబ్దంగా వుండటంతో ఉదయాన్నే ఆ అమ్మని కలుద్దామని నిర్ణయించుకుంది.

* * *

"నిన్న రాత్రి నే జూసిన పోరోడు మీ యబ్బాయే...! దీన్ని పొరబాటున పారేస్కొలే... గావల్నే దీన్ని ఆడప డేసి పోయుండు"అంటూ కామాక్షితో చెప్పింది బిందు.

అప్పుడే అక్కడికొచ్చి అంతా విన్న మురళి అదిరిప డ్డాడు.

కామాక్షి, మోహన్‌లు నివ్వెరపోయారు. షాక్ తిన్నారు. యిలా అలా... కాదు... పెద్ద షాక్...! వారి కాళ్ళకింద నేల కంపించినట్లైంది. యిద్దరూ మురళికేసి చూసారు. ఆ చూపులు నిప్పులు కక్కుతున్నాయి.

ముందు తేరుకుంది మోహనే!

"ఏంరా...! ఆ పిల్ల చెప్పింది నిజమా...?" కంపిస్తున్న కంఠంతో అన్నాడు మోహన్.

తన మౌనంతో ఆ పిల్ల చెప్పింది నిజమేనని తేల్చే సాడు మురళి.

నిశ్చేష్టులైయ్యారు యిద్దరూ.

"ఎందుకు చేసావిలా...?" నిస్పృహతో కీచుగా వెలు బడిందా మాట మోహన్ గొంతునుండి.

"నాకు ఆస్ట్రేలియా వెళ్ళడం యిష్టంలేదు నాన్నా!" అన్నాడు మురళి యిక తనలోని మానసిక సంఘర్షణని తట్టుకోలేక.

ఆశ్చర్యపోవడం తల్లిదండ్రులిద్దరి వంతైంది.

"ఏంట్రా మురళీ...! నువ్వుచేసిన పిచ్చి పని చాలకా ఆ మాటలేంటి...? విదేశాలు వెళ్ళడానికి అందరూ ఎగి రిగెంతేస్తారు. నీకేమైంది...? అయినా ఈ విషయం యింతదాకా వచ్చాకా చెప్పడమేంటి...?" కోపంగా అంది కామాక్షి.

"... ... ..." మురళి మూగనోము నోచాడు.

"ఒరే... అలా మౌనంగా వుండకరా... భరించలేకపో తున్నాను. చెప్పు...! అసలు ఏముంది నీ మనసులో? నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానో తెలుసా? బాగా మార్కులు తెచ్చుకున్నావన్న కారణంతో నా స్థోమతకి మించి పడరాని పాట్లు పడి నిన్ను విదేశాలకి పంపడా నికి ఏర్పాటుచేసాను. యివన్నీ ఎందుకు? ఎవరికోసం? యిష్టంలేనప్పుడు ముందే ఎందుకు అడ్డుచెప్పలేదు? యిప్పుడొచ్చి ఈ నాటకందేనికి?" నిలదీసాడు మోహన్.

"చెప్తా నాన్నా... చెప్తా...! నాకు మనదేశంలోనే చదువు కోవాలనుంది. నాకు మీరన్నా... ఈ ఊరన్నా... ఈ దేశ మన్నా చాలాచాలా యిష్టం. నా మాతృభూమినీ,

> సామాన్యులకి ఉపయోగపడని ఉన్నత విద్యలు సాధించీ ఏం లాభం? తెలివితేట లున్న విద్యార్థి ఎక్కడ చదివినా ఒకటే. ఉత్తమ ఆశయాలు నాకూ వున్నాయి! మనిషి తలచుకోవాలే గానీ ఎక్కడ చది వినా అది ఏ ఫీల్డైనా అత్యున్నత శిఖరాలని అధిరోహించొచ్చన్నది నా అభిప్రాయం! అందుకు విదేశీ చదువులే అక్కర్లేదు."

మాతృమూర్తులని విడిచిపెట్టి వుండలేనని ఈ కొద్దిరో జుల్లో తెలుసుకున్నాను ఏం నాన్నా...! యిక్కడి చదు వులు పనికిరావా? యిక్కడ చదివీ ఎవ్వరూ డాక్టర్లు కావటం లేదా? ఒక్క విషయం నాన్నా...! విదేశాల్లో చదువుకున్నా అక్కడ కూడా పాఠాలు చెప్పేది నలభై శాతం భారతీయ ప్రొఫెసర్లే అన్న నిజం మీకు తెలీ దేమో? తల్లిదండ్రులు కిందామీద పడి పిల్లల్ని విదే శాల్లో చదివించడం... ఆపై ఖర్చుపెట్టింది రాబట్టుకోవ డానికి పవిత్రమైన వైద్య వృత్తిని వ్యాపారం చెయ్యడం! ఇదేగా మన దేశంలో ఈమధ్య జరుగుతోందీ? సామా న్యులకి ఉపయోగపడని ఉన్నత విద్యలు సాధించీ ఏం లాభం? తెలివితేటలున్న విద్యార్థి ఎక్కడ చదివినా ఒకటే. ఉత్తమ ఆశయాలు నాకూ వున్నాయి! మనిషి తలచుకోవాలే గానీ ఎక్కడ చదివినా అది ఏ ఫీల్డైనా అత్యున్నత శిఖరాలని అధిరోహించొచ్చన్నది నా అభి ప్రాయం! అందుకు విదేశీ చదువులే అక్కర్లేదు."

కాసేపాగి తిరిగి అందుకున్నాడు మురళి.

"మీ శక్తికి మించి నన్ను విదేశాలకి పంపుతున్నారని నాకు బాగా తెలుసు. మీ త్యాగాల నిచ్చెన మీద నేనం దలం ఎక్కలేను నాన్నా! మీరు చేస్తున్న ప్రయత్నాలకి యింతవరకూ అడ్డు ఎందుకు చెప్పలేదంటే, ప్రయా ణంలోపు నా మనసుతో రాజీపడొచ్చులేనని ఆశించా. మనఃపూర్వకంగా ప్రయత్నించాను కూడా. కానీ యిటు నా మనసుకీ అటు నామీద మీరు పెట్టుకున్న ఆశలకీ మధ్య నాలో జరిగిన మానసిక సంఘర్షణలో యిన్నిరో జులూ పూర్తిగా నలిగిపోయాను నాన్నా! చివరికి నా మనసుని చంపుకునే ప్రయత్నంలో పూర్తిగా విఫలమై నాను. దాంతో ఏం చెయ్యాలో తోచక ఈ పిచ్చి పని చేసాను" వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకా తండ్రిని కౌగి లించుకుని భోరుమన్నాడు మురళి.

కొద్ది నిమిషాల పాటూ అక్కడ కఠోర నిశ్శబ్దం!

కొడుకు మనోభావాలని తెలుసుకుని మోహన్ విస్తు పోయాడు. అతడికి తెలీకుండానే కొడుకు తల నిము రుతూ-

"ఊఁ... నీ మనసులో ఏముందో యిప్పుడు తెలిసిం దిరా...! నిన్నర్థం చేసుకోకుండా ఎంతసేపూ నా దృష్టిలో నేను ఆలోచించుకోపోయానే గానీ, నీ మనసు నొప్పి స్తున్నానని యిన్నాళ్ళూ ఈ చేతులు మీదిగా పెంచి పెద్ద చేసి కూడా గ్రహించలేకపోయాను. సరే... జరిగిందేదో జరిగింది. యిక పూర్తిగా నీ యిష్టం!" అంతకంటే ఎక్కువ మాట్లాడలేకపోయాడు మోహన్.

యిటు కామాక్షి కళ్ళు వర్షిస్తున్నాయి. ఆమె ఆలోచ నలు వేరే విధంగా వున్నాయి. ఎంతలో పెద్ద ఆపద తప్పింది? ఎదిగీ ఎదగని వయసులో సునిశిత మనస్కు లైన పిల్లలు తమ యిష్టాయిష్టాలని వ్యక్తపరచలేకా తమలో తామే మథనపడుతూ ఒంటరికనాన్ని భరించ లేకా చివరికి ఆత్మహత్యలు చేసుకునేవారిని ఎందరిని చూడలేదూ...? అప్పుడు తల్లిదండ్రులకి మిగిలేదేంటి? మానసిక క్షోభ మాత్రమే! తన కొడుకు విషయంలో అలా జరగకుండా పెద్ద ముప్పు తప్పింది. అందుకే ఆమెకి సంతోషంగా వుంది.

ఎదురుగా యిదేమీ అర్థంకాకుండా పిచ్చి చూపులు చూస్తున్న బిందుని దగ్గరకి తీసుకుని.

"బిందూ...! ఈరోజు నీ మూలంగా మా అబ్బాయిని అర్థంచేసుకున్నాం. నువ్వు మాకు చేసిన మేలు సామా న్యమైంది కాదు. తృణమో పణమో యిచ్చి తీర్చుకునే ఋణం కాదది. నీకు చదువంటే యిష్టముంటే చెప్పు. మాకు చేతనైన సహాయం మేం చేస్తాం" స్థిరంగా అంది కామాక్షి.

మోహన్ తన భార్య నిర్ణయాన్ని మనసులోనే అభి నందించాడు.

ఈ మాటలకి బిందు మొహంలో ఏదో ఆశ తళుక్కు మంది.

★

## ఫిరంగి

ఫిరంగుల్లో ఉపయోగించే గన్‌పౌడర్ ఆవిష్కరణ జరిగిన తర్వాతనే ఫిరంగులు ఉప యోగంలోకి వచ్చాయి. పూర్వరోజుల్లో శత్రువుల కోట గోడలను పగలకొట్టటానికి అధి కంగా ఉపయోగించేవారు. అయితే ఈ ఫిరంగుల గన్ పౌడర్‌ను కనుగొన్నది ఎవరో ఇంతవరకూ ఇదమిత్థంగా తెలియలేదు. కొంతమంది చైనీయులు క్రీశ 1000 సంవ త్సర ప్రాంతంలో గన్‌పౌడర్‌ను తయారుచేశారని అంటున్నారు. పెట్లుప్పు, గంధకం బొగ్గుల మిశ్రమంతో తయారయ్యే ఈ గన్‌పౌడర్ నిప్పు తాకితే చాలు పేలుతుంది.

## మట్టి పర్వతం

ప్రపంచంలోనే అతి పెద్దదైన సహారా ఎడారిలో చెలరేగే బలమైన గాలులు, మట్టి తుఫానుల కారణంగా ప్రతియేటా 20కోట్ల టన్నుల ఇసుక ఆ పక్కనే వున్న అట్లాం టిక్ మహాసముద్రంలో కలిసిపోతున్నది. ఈ మట్టినంతా ఒక మేటగా చేరిస్తే 16,405 అడుగుల ఎత్తున ఓ ఇసుక కోట నిర్మించవచ్చు. సహారా ఎడారిలో ఒక పెద్ద ఇసుక దిబ్బ వుంది. దీని ఎత్తు 1411 అడుగులు. ఈజిప్ట్‌లో వున్న పిరమిడ్లకన్నా మూడు రెట్లు ఎక్కువ ఎత్తు.